AKSHARA TODAY
అక్షరటుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN

జమ్మూకశ్మీర్‌లో భూకంపం..

అక్షరటుడే, నేషనల్‌డెస్క్: జమ్మూకశ్మీర్‌లో సోమవారం ఉదయం 5.35 గంటలకు భూకంపం సంభవించింది. పలు ప్రాంతాల్లో ప్రకంపనలు రావడంతో స్థానికులు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. భూకంపం తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 4.8గా నమోదైంది. జర్మన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ ప్రాథమిక డేటా ప్రకారం.. బుడ్గామ్ జిల్లాలో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. 33.9N - 74.76E వద్ద 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం నమోదైంది. భూకంప కేంద్రానికి 4 కిలోమీటర్ల దక్షిణాన ఉన్న చరార్‌ఇషరీఫ్, తూర్పున 13 కిలోమీటర్ల దూరంలో ఉన్న పుల్వామా, 21 కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీనగర్, షోపియన్‌లతో సహా సమీప ప్రాంతాలలో ప్రకంపనలు ఏర్పడ్డాయి.

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుపై కేసు

అక్షరటుడే, హైదరాబాద్: మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత ఎర్రబెల్లి దయాకర్‌రావుపై కేసు నమోదైంది. ఆయనతో పాటు మరో 33 మంది బీఆర్ఎస్ నాయకులపై మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పోలీసులు కేసు నమోదు చేశారు. కేసీఆర్‌కు సిట్ నోటీసులు, విచారణ నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎర్రబెల్లి రావు ఆధ్వర్యంలో వరంగల్ - ఖమ్మం రహదారిపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ క్రమంలో వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

2-2-2026 (Monday) MAIN EDITION

కాంగ్రెస్ ఏం చేసిందో చెప్పాలి

అక్షరటుడే, హైదరాబాద్: కాంగ్రెస్ అనేక మోసపూరిత వాగ్దానాలు చేసిందని.. అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా ఇచ్చిన హామీలను అమలు చేయలేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు విమర్శించారు. హైదరాబాద్‌లో ఆయన మాట్లాడారు. బూటకపు హామీలు.. మోసపూరిత వాగ్దానాల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఛార్జ్‌షీట్ విడుదల చేసినట్లు తెలిపారు.

జోగి రమేశ్‌పై కేసులు నమోదు

అక్షరటుడే, ఏపీ: ఆంధ్ర ప్రదేశ్ మాజీ మంత్రి, వైసీపీ నాయకుడు జోగి రమేశ్‌పై కేసులు నమోదవుతున్నాయి. మంత్రి లోకేశ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఇబ్రహీంపట్నం, తిరువూరు, చిత్తూరు జిల్లాలో టీడీపీ నాయకులు కేసు పెట్టారు. నకిలీ మద్యం తయారీ కేసులో కండీషన్ బెయిల్పై ఉన్న జోగి రమేష్ బయటకు వచ్చిన విషయం తెలిసిందే.

చైనాలో నలుగురికి మరణశిక్ష..

అక్షరటుడే, నేషనల్ డెస్క్: చైనాలో మరో నలుగురికి మరణశిక్ష అమలైంది. మయన్మార్ కేంద్రంగా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న గ్యాంగ్‌ల్లోని సభ్యులకు ఈ శిక్షను అమలు చేసినట్లు షెంజెన్ ఇంటర్మీడియెట్ పీపుల్స్ కోర్టు వెల్లడించింది. హత్యలు, టెలికాం మోసం, డ్రగ్ ట్రాఫికింగ్‌తో పాటు ఆరుగురు చైనీయుల మరణానికి కారణమైనట్లు తేలడంతో గతేడాది కోర్టు ఈ శిక్ష విధించింది.

రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ ఆగ్రహం

అక్షరటుడే, వెబ్‌డెస్క్: లోక్‌సభలో గందరగోళం నెలకొంది. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగింది. ఆయన గాల్వాన్ ఘటన గురించి మాట్లాడారు. దీనిపై కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. సబ్జెక్ట్ గురించి మాట్లాడాలని స్పీకర్ సైతం రాహుల్ గాంధీ మైక్ కట్ చేశారు. దీంతో కాంగ్రెస్ సభ్యులు ఆందోళన చేశారు.

మేరీకోమ్ వివాదాస్పద వ్యాఖ్యలపై వివరణ..

అక్షరటుడే, నేషనల్‌డెస్క్: బాక్సింగ్ దిగ్గజం మేరీ కోమ్ తన మాజీ భర్తపై చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో దుమారం రేపిన నేపథ్యంలో తాజాగా వివరణ ఇచ్చారు. ఒక టాక్ షోలో తన మాటలు ఏళ్ల తరబడి అణచిపెట్టుకున్న భావోద్వేగాల ఫలితమేనని, పురుష సమాజాన్ని లేదా ఇతర క్రీడాకారులను అవమానించే ఉద్దేశం తనకు ఎట్టి పరిస్థితుల్లోనూ లేదని స్పష్టం చేశారు. తన వ్యాఖ్యల వల్ల ఎవరి మనోభావాలైనా దెబ్బతిన్నట్లయితే హృదయపూర్వక క్షమాపణలు కోరుతున్నట్లు తెలిపారు. ఇటీవల ప్రసారమైన 'ఆప్ కీ అదాలత్' కార్యక్రమంలో మేరీ కోమ్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలు పంచుకున్న విషయం తెలిసిందే.

ఉక్రెయిన్‌పై రష్యా దాడి.. పలువురు మృతి

అక్షరటుడే, నేషనల్‌డెస్క్: ఉక్రెయిన్‌పై మరోసారి రష్యా దాడి చేసింది. నిప్రో నగరంపై డ్రోన్లతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో 15 మంది చెందగా.. ఏడుగురు గాయపడ్డారు. ఉక్రెయిన్‌లోని ఆగ్నేయ డ్నిప్రోపెట్రోవ్స్క్ ప్రాంతంలో గని కార్మికులను తీసుకెళ్తున్న బస్సుపై రష్యా డ్రోన్ దాడి చేసిందని ఆ దేశ ఇంధన మంత్రి తెలిపారు. ఈ ఘటనలో 12 మంది మరణించారని చెప్పారు. అంతకుముందు రాత్రిపూట, ఆదివారం జరిగిన వేర్వేరు రష్యన్ దాడుల్లో కనీసం ఇద్దరు మరణించగా, తొమ్మిది మంది గాయపడ్డారని తెలిపారు. టెర్నివ్కా నగరంలో ఈ దాడి జరిగిందని పోలీసులు తెలిపారు.

ఒకదానికొకటి పోటీ పడుతూ రాకెట్ వేగంతో దూసుకు వెళ్లిన బంగారం, వెండి ధరలు.. అంతకన్నా వేగంగా దిగివస్తున్నాయి. పుత్తడి ధర పతనమవుతుండగా.. వెండికొండ కరిగిపోతోంది. పెళ్లిళ్ల సీజన్ ముందు ధరలు తగ్గడంతో సామాన్యులు కాస్త ఉపశమనం పొందుతున్నారు.

–అక్షరటుడే, బిజినెస్ డెస్క్

దిగొస్తున్న ధరలు..

- కరుగుతున్న వెండి కొండ
- పడిపోతున్న పుత్తడి ధర
- పతనంలోనూ పోటాపోటీ

కొంతకాలంగా ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న జియో పొలిటికల్ టెన్షన్స్, అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికైన తర్వాత శత్రు, మిత్ర భేదం లేకుండా విధిస్తున్న టారిఫ్‌లతో ఏర్పడిన ఆర్థిక అనిశ్చిత పరిస్థితులతో ఇన్వెస్టర్లు సురక్షిత పెట్టుబడి మార్గాలను వెతుక్కుంటున్నారు. అలాంటివారు బంగారం, వెండి వంటి మెటల్స్‌లో పెట్టుబడులు పెట్టడం ప్రారంభించారు. దీనికితోడు డీడాలరైజేషన్‌కు పలు దేశాలు ప్రాధాన్యత ఇచ్చాయి. ఇదే సమయంలో చాలా దేశాల కేంద్ర బ్యాంకులు బంగారు నిల్వలను పెంచుకున్నాయి. దీంతో బంగారం ధరలకు రెక్కలొచ్చాయి. ఇటీవల పది గ్రాము స్వచ్ఛమైన బంగారం ధర రూ. 1.80 లక్షలు, కిలో వెండి ధర రూ. 4 లక్షలు దాటిన సంగతి తెలిసిందే.

ట్రంప్ ప్రకటనతో దిగివచ్చిన ధరలు

ట్రంప్ అనుసరిస్తున్న విధానాలతో కొండెక్కిన బంగారం, వెండి ధరలు.. తిరిగి అదే ట్రంప్ కారణంగా దిగివస్తున్నాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ చీఫ్‌గా జెరోమ్ పావెల్ స్థానంలో కెవిన్ వార్ష్ పేరును ట్రంప్ ప్రతిపాదించారు. ఆయన డాలర్ బలోపేతానికి ప్రాధాన్యత ఇస్తారన్న పేరుంది. దీంతో ఇతర కరెన్సీలతో పోలిస్తే డాలర్ బలోపేతం అవుతుందన్న అంచనాలతో ఇన్వెస్టర్లు ఈ నిర్ణయాన్ని ప్రతికూలంగా తీసుకున్నారు. మరోవైపు ఇరాన్‌తో డీల్ ఉంటుందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇచ్చిన సంకేతాలతో జియో పొలిటికల్ టెన్షన్స్ తగ్గే అవకాశాలున్నాయి. ఈ కారణంతోనూ ఈ రెండు లోహాల ధరలు దిగి వస్తున్నాయని అనలిస్టులు పేర్కొంటున్నారు. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో సోమవారం మధ్యాహ్నం 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ. 1.48 లక్షల వద్ద ఉండగా.. కిలో వెండి ధర రూ. 2.48 లక్షల వద్ద కొనసాగుతోంది. కమోడిటీల ట్రేడింగ్ జరిగే మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో 10 గ్రాముల బంగారం ఏప్రిల్ కాంట్రాక్టు ధర రూ.1,39,446 వద్ద, కిలో వెండి మార్చి కాంట్రాక్టు ధర రూ.2.27 లక్షల వద్ద కొనసాగుతున్నాయి.

పెళ్లిళ్ల సీజన్‌లో ఊరట

రాకెట్ స్పీడ్‌తో పైకి దూసుకువెళ్తున్న బంగారం, ధరలు సామాన్యులను ఆందోళనకు గురిచేశాయి. ఈ నెలలో వివాహాది శుభకార్యాలు జోరుగా సాగనున్నాయి. ఈ నేపథ్యంలో కొండెక్కిన ధరలతో బంగారం, వెండి ఎలా కొనాలా అని ఆందోళన చెందుతున్న సామాన్యులకు ప్రస్తుతం తగ్గిన ధరలు కాస్త ఊరట నిస్తున్నాయి. అయితే భారీగా ధర తగ్గడంతో బంగారం కొనడానికి ఇదే మంచి సమయమని పలువురు భావిస్తుండగా.. మార్కెట్ మరిన్ని కనిష్టాలను తాకుతుందేమోనని భయపడుతున్నవారు కొనాలా మరి కొన్నాళ్లు ఆగాలా అన్న డైలమాలో ఉన్నారు. ధరలు ఇంకా తగ్గే అవకాశం ఉందేమోనని కొద్దిరోజులు వేచి చూడడం లేదా విడతల వారీగా కొనుగోలు చేయడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

పోటీలో రెబల్స్ ఉండొద్దు..: సీఎం రేవంత్‌రెడ్డి

అక్షరటుడే, హైదరాబాద్: పురపోరుపై సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం ఉదయం మంత్రులు, పీఏసీ నేతలతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పలువురు మంత్రులు, పీఏసీ సభ్యులతో ఆయన జూమ్ మీటింగ్‌లో మున్సిపల్ ఎన్నికలపై చర్చించారు. గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు అని అన్ని సర్వేలు చెబుతున్నాయని వివరించారు. అంతా సమష్టిగా పని చేయాలని, రెబల్స్ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పార్టీ కోసం పని చేసేవాళ్లను గెలిపించుకోవాలని సీఎం సూచించారు. టికెట్‌రాని బలమైన నాయకులు ఉంటే.. కార్పొరేషన్ పదవుల్లో అవకాశం ఇస్తామని హామీ ఇవ్వాలన్నారు. అభ్యర్థిని ఖరారు చేసిన వాళ్లే గెలుపు బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి అభ్యర్థి లోకల్‌గా మేనిఫెస్టో సిద్ధం చేసుకోని పోటీ చేయాలన్నారు.

ఉద్యమ రోజులు మళ్లీ గుర్తుకొచ్చాయి: కేటీఆర్

అక్షరటుడే, హైదరాబాద్: కేసీఆర్‌కు సిట్ నోటీసులను నిరసిస్తూ బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో నిరసనలు చేపట్టారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఉద్యమ రోజులు మళ్లీ గుర్తుకొచ్చాయని చెప్పారు. పార్టీ క్యాడర్‌కు ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పాలనా వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. దావోస్ ఒప్పందాల ద్వారా వచ్చిన పెట్టుబడులపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ నందినగర్ వస్తే అధికారికంగా 900 మంది పోలీసులను పెట్టాదన్నారు. అయితే అనధికారికంగా ఆ సంఖ్య ఇంకా ఎక్కువే ఉంటుందన్నారు. హైదరాబాద్‌లో పట్టపగలే కాల్పులు, దోపిడీ ఘటనలు జరుగుతున్నాయని.. యథేచ్ఛగా సహజ వనరుల దోపిడీ కొనసాగుతోందని విమర్శించారు. వీటిపై బీఆర్ఎస్ నిలదీస్తుంటే దృష్టి మరల్చేందుకు సిట్‌ల పేరిట విచారణలు చేస్తున్నారన్నారు.

సజ్జనార్ ట్వీట్‌కు హరీష్‌రావు కౌంటర్

అక్షరటుడే, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్‌కు నేతృత్వం వహిస్తున్న సజ్జనార్ ట్వీట్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు కౌంటర్ ఇచ్చారు. కోర్టు తీర్పు లేకుండానే ఫోన్ ట్యాపింగ్‌ను అక్రమం అని ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు కేసీఆర్‌ను విచారించిన విషయం తెలిసిందే. అనంతరం హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఎక్స్ వేదికగా సిట్ విచారణపై వివరాలు వెల్లడించారు. అక్రమంగా ఫోన్ ట్యాపింగ్ చేసిన కేసులో కేసీఆర్ విచారణ ముగిసిందని ఆయన పోస్ట్ పెట్టారు. ఈ పోస్ట్‌పై హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. దర్యాప్తు దశలోనే తీర్పు చెప్పే అధికారం సిట్ చీఫ్‌కు లేదన్నారు.

సిట్ పిలిస్తే విచారణకు వెళ్తా..: కవిత

అక్షరటుడే, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సిట్ విచారణపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పందించారు. సోమవారం మీడియాతో మాట్లాడారు. ప్రజా జీవితంలో ఉన్నప్పుడు అన్నింటిని ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. చట్టానికి ఎవరూ అతీతులు కారన్నారు. వారి ఆలోచన విధానంలో మార్పు రానన్ని రోజులు బీఆర్ఎస్‌ను ఎవరు కాపాడలేరని వ్యాఖ్యానించారు. మున్సిపల్ ఎన్నికల వరకు ఈ కేసు విచారణ పేరిట హడావుడి చేస్తున్నారని ఆమె ఆరోపించారు. ఈ కేసు విచారణ పూర్తి చేసి నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కేసులో తనను సిట్ అధికారులు విచారణకు పిలిస్తే హాజరవుతానని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో పని చేసే అభ్యర్థులను గెలిపించాలని కవిత కోరారు. గుడ్డిగా పార్టీ గుర్తు చూసి ఓటు వేయొద్దన్నారు. తమ జాగృతి నాయకులు సైతం పలు చోట్ల పోటీ చేస్తున్నట్లు తెలిపారు. వారు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ పేరిట పోటీలో ఉంటారన్నారు. సాధ్యమైనంత వరకు మంచి వారికే టికెట్లు ఇచ్చామన్నారు. వారిని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అందుకే విడిపోయాం..: మృణాల్

కొన్ని రోజులుగా ప్రేమ, పెళ్లి అంశాల్లో తరచూ వార్తల్లో నిలుస్తన్నారు నటి మృణాల్ ఠాకూర్. తాజాగా ఆమె తన మాజీ ప్రేమికుడి గురించి చెప్పడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అతడితో బ్రేకప్ అయినందుకు తానేమీ బాధ పడలేదన్నారు. మృణాల్ నటించిన 'దో దీవానే శహర్ మే' ఫిబ్రవరి 20న రిలీజ్ కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో తన మాజీ బాయ్ ఫ్రెండ్ గురించి తెలిపారు. "నాకు దూకుడు ఎక్కువని నాతో ఉండలేనంటూ బ్రేకప్ చెప్పాడు. నేను యాక్టింగ్ చేయడం కూడా తనకు నచ్చలేదు. బ్రేకప్ చెప్పినందుకు నేను బాధపడలేదు. అలాంటివాళ్లతో కొనసాగడం కూడా కష్టమే. అందుకే విడిపోయాం" అని చెప్పారు.

- అక్షరటుడే, సినిమా డెస్క్

పాక్‌లో బలూచ్ వేర్పాటువాదుల దాడి.. 125 మంది మృతి

అక్షరటుడే, నేషనల్ డెస్క్: పాక్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో బలూచ్ లిబరేషన్ ఆర్మీ, పాకిస్థాన్ భద్రతా బలగాల మధ్య జరిగిన భీకర దాడులు జరిగాయి. ఈ ఘటనలో ఇప్పటివరకు 125 మంది ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. ప్రావిన్స్‌లోని 12 కీలక ప్రాంతాల్లో ఏకకాలంలో బీఎల్ఏ దాడులు చేసింది. సైనిక స్థావరాలు, రవాణా మార్గాలు, పౌర నివాసాలపై దాడులు చేయడంతో ప్రాణ నష్టం జరిగింది. వేర్పాటువాదుల దాడిలో పౌరులు సహా 33 మంది మరణించారని పాకిస్తాన్ సైన్యం తెలిపింది. అనంతరం భద్రతా దళాలు 92 మంది దుండగులను కాల్చి చంపినట్లు పేర్కొంది. దాడుల సమయంలో బలూచ్ తిరుగుబాటుదారులు పౌరులు, అధిక భద్రత కలిగిన జైలు, పోలీసు స్టేషన్లు పారామిలిటరీ స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నారు. దాడుల్లో 18 మంది పౌరులు, 15 మంది భద్రతా సిబ్బంది, 92 మంది తిరుగుబాటుదారులు మరణించారని సైన్యం తెలిపింది.